క్లుప్తంగా

హరీశ్‌రావుకే మా మద్దతు



రాజనర్సుకు తీర్మానపత్రాన్ని అందిస్తున్న నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అసెంబ్లీ ఎన్నికల్లో తమ మద్దతు సిద్దిపేట బీఆర్‌ఎస్ అభ్యర్థి హరీశ్‌రావుకే అంటూ రంగధాంపల్లి రెడ్డి సంఘం నా యకులు మద్దతు ప్రకటించారు. ఆదివారం సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సుకు తీర్మానప్రతిని అందించారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు వంగ నాగిరెడ్డి, కౌన్సిలర్ రేణుక తిరుమల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

'ప్రతి ఇంటికి వెళ్లాలి'

హుస్నాబాద్: కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఓటర్ జాబితాపై బూత్ లెవల్ అధ్యక్షులకు ఏఐసీసీ కార్యదర్శి క్రిస్టోఫర్ తిలక్, ఏఐసీసీ సభ్యుడు, అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకుడు గోపీనాథ్ పలనియప్పన్ శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఓటర్ లిస్ట్ ఆధారంగా ప్రతి ఇంటికి వెళ్లి ఆరు గ్యారంటీలపై వివరించాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బంక చందు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బెజ్జంకి బాబు, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు బిఖ్యా నాయక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి 'ఆపన్నహస్తం'

గజ్వేల్‌రూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ నిరుపేద కుటుంబానికి 'ఆపన్నహస్త మిత్ర బృందం' చేయూతనందించింది. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌కు చెందిన సాంయసుష్మిత గుండె సంబంధిత వ్యాధితో, ఆమె సోదరుడు బోన్ మ్యారో వ్యాధితో బాధపడుతున్నారు. వీరి తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా.. తల్లి ఇందిర చిరు వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తుంది. విషయం తెలుసుకున్న ఆపన్నహస్త మిత్రబృందం సభ్యులు ఆదివారం వారికి రూ. 20 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఆపన్నహస్త మిత్రబృందం అధ్యక్షుడు బాల్‌చంద్రం, ప్రధాన కార్యదర్శి కటుకం శ్రీనివాస్, కోశాధికారి శ్యామ్‌ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలతో మేలు



నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న కవ్వంపెల్లి సత్యనారాయణ

బెజ్జంకి(సిద్దిపేట): కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీతో పేద ప్రజలకు లబ్ధి చేకూరుతుందని ఆపార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు, మానకొండూర్ అభ్యర్థి కవ్వంపెల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మండలంలోని లక్ష్మీపూర్‌లో ఆదివారం ఆయన పర్యటించారు. ఈసందర్భంగా వివిధ పార్టీల నాయకులను పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, మండల పార్టీ అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

కొమురవెల్లి(సిద్దిపేట): జనగామ నియోజకవర్గ సీపీఎం అభ్యర్థి కనకారెడ్డిని గెలిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి కోరారు. ఆదివారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యుడు బద్దిపడగ కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ దాసరి కళావతి, సర్పంచ్‌లు చెరుకు రమణారెడ్డి, రవీందర్, మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి పాల్గొన్నారు.

నేడు దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనం

సిద్దిపేటజోన్: సిద్దిపేట పట్టణంలోని కొండ బూదేవి గార్డెన్‌లో సోమవారం దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనం జరుగుతుందని దివ్యాంగుల సంక్షేమ నాయకులు దండు శంకర్, కట్కూరి యాదగిరి తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ.. ఈసభకు మంత్రి హరీశ్‌రావు హాజరవుతున్నట్లు చెప్పారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని పోలింగ్ బూత్‌లను ఆదివారం సిద్దిపేట ఆర్డీఓ రమేష్‌బాబు, మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్, ఏసీపీ సురేందర్‌రెడ్డి, టూటౌన్ సీఐ రవికుమార్ పరిశీలించి ఏర్పాట్లపై ఆరా తీశారు. కార్యక్రమంలో సిద్దిపేట ఆర్డీఓ రమేష్‌బాబు, సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్, సిద్దిపేట ఏసీపీ సురేందర్‌రెడ్డి, టూటౌన్ సీఐ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి



క్యూ కాంప్లెక్స్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఆలయ ఈఓ బాలాజీ

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటామని ఆలయ ఈఓ బాలాజీ హెచ్చరించారు. ఆదివారం ఆలయంలో రూ.12 కోట్లతో చేపడుతున్న క్యూ కాంప్లెక్స్ పనులను పరిశీలించారు. కాంక్రీట్ పనుల్లో సదరు కాంట్రాక్టర్ ఇసుక బదులు డస్ట్ వాడుతున్నట్లు దృష్టికి రావడంతో సూపర్‌వైజర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్వాలిటీ కంట్రోల్ అధికారులు ధ్రువీకరించిన తర్వాతే బిల్లులు చెల్లిస్తామన్నారు. లేనిపక్షంలో సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



ఆకునూరులో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

చేర్యాల(సిద్దిపేట)/గజ్వేల్‌రూరల్: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సీఐ సత్యనారాయణరెడ్డి సూచించారు. మండలపరిధిలోని ఆకునూరు, గుర్జకుంట, చిట్యాల, వీరన్నపేటలో ఆదివారం కేంద్ర బలగాలతో కలిసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు భాస్కర్‌రెడ్డి, రామ్మోహన్, నాగరాజు, యూనస్, సబ్బంది, తదితరులు పాల్గొన్నారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్అండ్ఆర్ కాలనీలో ఆదివారం ఎస్ఐ శంకర్, ఏఎస్ఐ పర్శరాములు, కేంద్ర బలగాల అధికారులు, సిబ్బంది, పోలీస్ సిబ్బందితో కలిసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు.

'రఘునందన్‌రావు గెలుపు ఖాయం'

మిరుదొడ్డి(దుబ్బాక)/రాయపోలు: దుబ్బాక బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు గెలుపు ఖాయమని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి సుధారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మండలపరిధిలోని మల్లుపల్లి, లింగుపల్లిలో బీజేపీ మండల అధ్యక్షుడు ఎల్కుల దేవరాజు ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు చెప్పే మాయమాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నారాయణరెడ్డి, శేఖర్‌రెడ్డి, రమేష్, నవీన్, శంకర్, బాలకృష్ణ, భిక్షపతి, నాగరాజు, రంగారెడ్డి, పర్శరాములు, రాము, అజయ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే రాయపోలు మండలం ఎల్కల్‌లో మండలపార్టీ అధ్యక్షుడు మాదాసు వెంకట్‌గౌడ్, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు మంకిడి స్వామి, రాష్ట్ర నాయకుడు బాగన్నగారి రవీందర్‌రెడ్డి తదితరులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రాయ పోలు వైఎస్ ఎంపీపీ రాజిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ నర్సింలు, నాయకులు వెంకటేశ్‌గౌడ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సుపరిపాలన



పార్టీలో చేరిన వారితో ప్రతాప్‌రెడ్డి



ఆరు గ్యారంటీ స్కీంలపై అవగాహన కల్పిస్తున్న కొమ్మూరి

- నియోజకవర్గంలో భూకబ్జాలు లేకుండా చేస్తా
- అబద్ధాలు, అవినీతికి కేరాఫ్ కేసీఆర్
- కాంగ్రెస్ జనగామ అభ్యర్థి 'కొమ్మూరి'
- జిల్లా కేంద్రంలో ఇంటింటి ప్రచారం



మాట్లాడుతున్న కొమ్మూరి, పక్కన నాయకులు



క్యాన్‌లో నీరు పట్టి.. ఓటు అడుగుతున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

జనగామ: కాంగ్రెస్‌తోనే సుపరిపాలన.. తెలంగాణలో అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ జనగామ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లా కేంద్రంలోని 30, 13, 16, 15, 1వ వార్డులో పర్యటించారు. వందలాదిగా తరలివచ్చిన యువకులతో కొమ్మూరి ముందుకు సాగారు. ఆయా వార్డులు, కాలనీల్లో ప్రజలు, పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికాయి. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో చెప్పిన విధంగా అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీ పథకాలతో పాటు ఆడబిడ్డల వివాహానికి రూ.లక్షతో పాటు తులం బంగారం అందిస్తామని చెప్పారు. ఆరు గ్యారంటీ పథకాలకు అన్ని వర్గాల ప్రజల నుంచి అనూహ్య ఆదరణ వస్తోందని పేర్కొన్నారు. గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో పేదలకు ఇచ్చిన ఇళ్లే తప్ప.. పదేళ్ల కాలంలో బీఆర్‌ఎస్ సర్కారు జనగామలో ఒక్కరికి కూడా డబుల్ బెడ్రూం ఇల్లు ఇవ్వలేదని చెప్పారు. తల్లి సోనియా గాంధీ ఈ ప్రాంత బిడ్డల ఆకాంక్ష మేరకు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేసిందని, ఆమె రుణం తీర్చుకునే సమయం వచ్చిందని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ప్రజలను ఆంధ్రులుగా సంబోధించిన కేసీఆర్, నేడు ఆంధ్రప్రాంత వాసిగా లెక్కించే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని మన వద్దకు పంపించారని విమర్శించారు. నీళ్లు, నిధులు, ఉద్యోగాల కోసం పోరాటం చేస్తే.. కేసీఆర్ మాత్రం జనగామ ప్రాంతానికి సంబంధించిన నీళ్లను పక్క జిల్లాలకు దోచుకొని పోతున్నారని దుయ్యబట్టారు. నాడు ఆంధ్రోళ్లు దోచుకుంటే, నేడు మనవాళ్లే జిల్లాకు తీరని అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ పేరు చెప్పి రూ.లక్ష కోట్లు సంపాదించుకున్న కేసీఆర్ ఇక్కడి వనరులను ఆంధ్రా కాంట్రాక్టర్లకు అప్పగించారని ధ్వజమెత్తారు. కేసీఆర్ ఇక్కడకు వచ్చి ప్రచారం చేస్తే తాడుతో కట్టేసి బుద్ధి చెప్పాలని అన్నారు. పదేళ్ల క్రితం కేసీఆర్ ముత్తిరెడ్డిని పంపిస్తే.. వందల ఎకరాల భూములు కబ్జా చేసి ఈ ప్రాంతాన్ని నాశనం చేశాడని ఆరోపించారు. ఇప్పటికైనా జనగామ ప్రాంత ప్రజలు మేలుకుని బీఆర్‌ఎస్ చెప్పే అబద్ధపు మాటలను నమ్మొద్దని, ఈసారి జరిగే ఎన్నికల్లో స్థానికుడినైన తనను గెలిపించాలని కోరారు.

పార్టీలో పలువురి చేరిక

పట్టణంలోని 23, 22, 8, 5వ వార్డుల నుంచి ఆయా పార్టీలకు చెందిన 300 మంది యువకులతో పాటు టీడీపీకి చెందిన స్టాలిన్ ఆధ్వర్యంలో 50 మంది కాంగ్రెస్‌లో చేరగా వారికి కొమ్మూరి కండువా కప్పి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, వేమళ్ల సత్యనారాయణరెడ్డి, ఎర్రమల్ల సుధాకర్, కంచ రాములు, చారబుడ్ల దయాకర్‌రెడ్డి, వంగాల మల్లారెడ్డి, మేడ శ్రీనివాస్, చెంచారపు బుచ్చిరెడ్డి, గాదెపాక రాంచందర్, బోట్ల నర్సింగరావు, గంగరబోయిన మల్లేష్, రామగళ్ల అరుణవిజయ్‌కుమార్, ముస్త్యాల చందర్, బనుక శివరాజ్‌యాదవ్, ఎండీ.అన్వర్, ఆకుల వేణుగోపాల్, కరుణాకర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, బండారు శ్రీనివాస్, కడారు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

చేర్యాలలో..

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని రాంపూర్‌కు చెందిన 40 మంది యువకులు మాజీ సర్పంచ్ రంగు శివశంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రతాప్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అలాగే కడవేర్గుకు చెందిన ఆరుగురు వార్డు సభ్యులు ప్రతాప్‌రెడ్డి కుమారుడు రాకేష్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

మడమతిప్పని నేత కేసీఆర్



కురుమల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న పల్లా, పక్కన ఎగ్గె మల్లేశం



రాజేశ్వర్‌రెడ్డికి గొంగడి, గొర్రెపిల్ల బహూకరిస్తున్న కులస్తులు

- కురుమల సంక్షేమానికి పెద్దపీట
- ఆశీర్వదించండి.. అభివృద్ధి చేసే బాధ్యత నాదే
- ఆత్మీయ సమ్మేళనంలో బీఆర్‌ఎస్ జనగామ అభ్యర్థి 'పల్లా'

జనగామ: మాట ఇస్తే మడమ తిప్పని నేత సీఎం కేసీఆర్ అని బీఆర్‌ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రం హైదరాబాద్ రోడ్‌లోని సాయిరాం కన్వెన్షన్ హాల్‌లో కొమురవెల్లి దేవస్థానం మాజీ చైర్మన్ సేవెల్లి సంపత్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కురుమల ఆత్మీయ సమ్మేళనంలో కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎగ్గె మల్లేశంతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో కురుమల సంక్షేమమే ధ్యేయంగా బీఆర్‌ఎస్ సర్కారు పనిచేసిందన్నారు. వారి ఆర్థికాభివృద్ధికి దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.11 వేల కోట్లతో రెండు విడతలుగా గొర్రెలు పంపిణీ చేసిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. అత్యంత విలువైన కోకాపేట్‌లో కురుమ సంఘం భవనం, హాస్టల్, కన్వెన్షన్ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయించి నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. గొల్ల, కురుమలకు బ్రహ్మాండమైన పథకాలను అమలు చేస్తున్నామని, కులవృత్తులకు పెద్ద పీట వేస్తున్న ముఖ్యమంత్రిని మూడోసారి సీఎంగా గెలిపించుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. జనగామ నియోజకవర్గంలో కురుమలకు కమ్యూనిటీ హాల్, కొమురవెల్లి దేవస్థానం చైర్మన్ పదవి తదితర డిమాండ్లు తన దృష్టిలో ఉన్నాయని చెప్పారు. రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు కురుమలకు పటిష్టమైన నాయకత్వం ఉందని పేర్కొన్నారు.



8వ వార్డులో మాట్లాడుతున్న రాజేశ్వర్‌రెడ్డి

పల్లాకు సంపూర్ణ మద్దతు : ఎగ్గె మల్లేశం

బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డికి కురుమలు సంపూర్ణంగా మద్దతు ఇస్తారని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశం అన్నారు. ఈ మేరకు తీర్మానం చేసినట్లు తెలిపారు. జనగామను రాష్ట్రంలోనే గుర్తింపు పొందిన జిల్లాగా అభివృద్ధి చేసేందుకు రాజేశ్వర్‌రెడ్డిని సీఎం కేసీఆర్ ఇక్కడికి పంపించారని పేర్కొన్నారు. నిత్యం ముఖ్యమంత్రితో సాన్నిహిత్యంగా ఉండే 'పల్లా' ఇక్కడికి రావడం జనగామ నియోజకవర్గ ప్రజల అదృష్టమని అన్నారు. కులస్తులను ఆయన కంటికి రెప్పలా కాపాడుకుంటారని తెలిపారు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత కురుమలకు ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టి గౌరవించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు.

దివ్యాంగులకు పింఛన్లు..

దేశ చరిత్రలో ఎక్కడాలేని విధంగా దివ్యాంగులకు పింఛన్లు అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. యశ్వంతాపూర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీకి దివ్యాంగులు దైవంతో సమానమని, సమాజంలో వారు గౌరవ ప్రదంగా బతకాలనే ఉద్దేశంతో కేసీఆర్ ప్రభుత్వం రూ.4,016



ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన దివ్యాంగులు

పింఛన్ అందిస్తున్నదని చెప్పారు. రాష్ట్రంలో మూడోసారి పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రస్తుత పింఛన్‌ను రూ.6,016కు పెంచుతుందన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఇలాగే కొనసాగాలంటే కారు గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్సీ బోడకుంటి వెంకటేశ్వర్లు, దివ్యాంగుల సంస్థ రాష్ట్ర చైర్మన్ వాసుదేవరెడ్డి, ఎమ్మెల్యే రాజయ్య, జెడ్పీ చైర్మన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు పాగాల సంపత్‌రెడ్డి, కురుమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లేశం, ఏఎంసీ చైర్మన్ బాల్దె సిద్ధిలింగం తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో ఇంటింటి ప్రచారం

జనగామ పట్టణంలోని 10వ వార్డులో పార్టీ కార్యాలయం ప్రారంభించిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి.. 7, 8 వార్డుల్లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా బోనాలు, కోలాటాలతో ప్రజలు స్వాగతం పలికారు. 'పల్లా' వెంట రాష్ట్ర నాయకులు వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు తాళ్ల సురేష్‌రెడ్డి, నీల శ్రీజరాం మనోహర్, మల్లవరపు అరవింద్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పి.జమునలింగయ్య, బండ యాదగిరి రెడ్డి, ముస్త్యాల దయాకర్, ఎంపీపీ మేకల కలింగ రాజు, నీల యాదగిరి, తిప్పారపు విజయ్ ఉన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న అంజిరెడ్డి

ములుగు(గజ్వేల్): కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యమని వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ జహంగీర్, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్, ములుగు పీఏసీఎస్ చైర్మన్ బట్టు అంజిరెడ్డి అన్నారు. మండలంలోని క్షీరసాగర్‌లో ఎంపీటీసీ కొన్యాల మమత బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామాలు అద్దంలా మెరిసిపోతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జయమ్మ అర్జున్‌గౌడ్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సలీం, వైస్ ఎంపీపీ దేవేందర్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నరేష్‌గౌడ్, సర్పంచ్ యాదమ్మ నర్సింగరావు, బీఆర్‌ఎస్ రాష్ట్ర యువజన కార్యదర్శి జుబేర్ పాష, మండల ప్రధాన కార్యదర్శి బాబుగౌడ్, ఉపాధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు గణేష్‌గుప్త, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు లింగారెడ్డి, మహిళా అధ్యక్షురాలు అక్షితరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు చంద్రశేఖర్‌రెడ్డి, బాపురెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, తారక సురేష్ పాల్గొన్నారు.

జగదేవ్‌పూర్(గజ్వేల్): గ్రామాలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలంటే మరోసారి సీఎం కేసీఆర్‌ను గెలిపించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీ రవీందర్ అన్నారు. ఆదివారం కుకునూర్‌పల్లి మండలం ఎల్లాయగూడ, పీటీ వెంకటాపూర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.

ముమ్మరంగా ప్రచారం



గౌరారంలో బీఆర్‌ఎస్ నాయకుల ప్రచారం

చేర్యాల(సిద్దిపేట)/రాయపోలు/దుబ్బాకరూరల్/మర్కూక్(గజ్వేల్)/వర్గల్(గజ్వేల్): జనగామ బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డిని గెలిపించాలంటూ పార్టీ శ్రేణులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆదివారం మండల పరిధిలోని ఆకునూరులో మార్కెట్ చైర్మన్ సుంకరి మల్లేశంగౌడ్, ఉల్లెంగుల సేవా ట్రస్ట్ చైర్మన్ ఏకానందం, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు కోతి విజయ్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. అలాగే కొత్త ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా రాయపోల్ మండలంలోని ఎల్కల్‌లో ఆ పార్టీ సీనియర్ నాయకుడు మామిడి మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ యాదగిరి, రైతుబంధు అధ్యక్షుడు రేకుల నర్సింహారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరశర్మ, ఇప్ప దయాకర్ తదితరులు ప్రచారం నిర్వహించారు. దుబ్బాక మండలంలోని పెద్దగుండవెల్లిలో ఎంపీపీ కొత్త పుష్పలత, జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజిరెడ్డి, నాయకులు రవీందర్‌రెడ్డి, రజనీకాంత్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, చిన్నిసంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. మర్కూక్ మండలంలోని కర్కపట్లలో మండల పార్టీ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, ఎంపీపీ పాండు, జెడ్పీటీసీ మంగమ్మ రాంచంద్రం, ఎంపీపీ ఉపాధ్యక్షుడు బాల్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కృష్ణయాదవ్, తదితరులు ప్రచారం నిర్వహించారు. వర్గల్ మండలంలో మండల పార్టీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, జిల్లా యూత్ అధ్యక్షుడు నాగరాజు బృందం గౌరారంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గజ్వేల్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని రాజీవ్ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... ప్రజ్ఞాపూర్ నుంచి సిద్దిపేట వైపు వెళ్తున్న ఓ ద్విచక్ర వాహనదారుడు మండల పరిధిలోని రిమ్మనగూడ సమీపంలో రోడ్డు దాటేందుకు నడుచుకుంటూ వెళ్తున్న పాదాచారుడిని తప్పించబోయి డివైడర్‌ను ఢీకొని రోడ్డుకు అవతలివైపు పడ్డాడు. అదే సమయంలో ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు రామాయంపేటకు చెందిన బల్ల ప్రత్యుష్ (24)గా గుర్తించినట్లు తెలిపారు. మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు చెప్పారు.

సంక్షిప్త వార్తలు

◆ బీఆర్‌ఎస్‌లో చేరికలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): ప్రతిపక్షాల మాయలో పడితే అభివృద్ధి కుంటుపడుతుందని బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ అన్నారు. ఆదివారం జగదేవ్‌పూర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అలాగే తిమ్మాపూర్‌కు ఇతర పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ఎంపీపీ బాలేశంగౌడ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు నాగరాజు, మాజీ సర్పంచ్ కరుణాకర్, నాయకులు కనకయ్య, కరుణాకర్, బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.



◆ ఎంపీ త్వరగా కోలుకోవాలని ప్రార్థనలు

దుబ్బాక: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి త్వరగా కోలుకోవాలని పట్టణంలో బిస్మిల్లా బైతుల్ మాల్ ట్రస్ట్ చైర్మన్ చాంద్‌మియా ఆధ్వర్యంలో ఆదివారం ముస్లింలు, బీఆర్‌ఎస్ నాయకులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

◆ ఆర్థికసాయం

వర్గల్(గజ్వేల్): తమతో కలిసి చదువుకున్న మిత్రుడు అనారోగ్యంతో మృతిచెందగా పూర్వ విద్యార్థులు అతడి కుటుంబానికి రూ.1,50,000 ఆర్థికసాయం అందించి ఉదారత చాటుకున్నారు. వర్గల్ మండలం తున్కిఖాల్సాకు చెందిన గుడ్ల వినయ్‌కుమార్‌గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అతడికి భార్య శిల్ప, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తున్కిఖాల్సా జెడ్పీ హైస్కూల్‌లో 2000–2001 బ్యాచ్‌లో తమతో పాటు చదివిన వినయ్‌కుమార్‌గౌడ్ మృతి సమాచారం తెలిసి చేయూతగా నిలిచారు. ఆదివారం కుటుంబీకులను పరామర్శించి రూ. 1,50,000 ఆర్థికసాయం అందజేశారు. మరో మిత్రుడు మీనాజీపేటకు చెందిన కీసరి గణేష్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలిసి రూ. 20,500 అందజేశారు.

◆ కరపత్రాల ఆవిష్కరణ

గజ్వేల్‌రూరల్: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే వరకు పోరాటం కొనసాగిస్తామని ఎంఆర్పీఎస్ మండల అధ్యక్షుడు సల్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈనెల 11న సికింద్రాబాద్‌లో తలపెట్టిన మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో గల ముత్యాలమ్మ, నల్లపోచమ్మ దేవాలయం వద్ద కరపత్రాలను ఆవిష్కరించారు.

◆ బీజేపీలోకి ఎల్లాయగూడ సర్పంచ్

జగదేవ్‌పూర్(గజ్వేల్): కూకునూర్‌పల్లి మండలం ఎల్లాయగూడ సర్పంచ్ రాములు ఆదివారం బీఆర్‌ఎస్ నుంచి గజ్వేల్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ సమక్షంలో చేరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌లో ప్రజాప్రతినిధులకు తగిన గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

◆ రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

దుబ్బాకరూరల్: బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన గల కల్వర్టులో పడి ఇద్దరు గాయపడ్డారు. ఈసంఘటన మండలంలోని తిమ్మాపూర్ వద్ద జరిగింది. ధర్మాజీపేటకు చెందిన నరేష్, రాములు సిద్దిపేట నుంచి దుబ్బాక వైపు వెళ్తుండగా రోడ్డు పక్కన నూతనంగా నిర్మిస్తున్న కల్వర్టులో పడి తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే 108లో సిద్దిపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.